## రాష్ట్ర వ్యాప్తంగా 5వేల ప్రాథమిక పాఠశాలలో

# గ్రంథాలయాల ఏర్పాటు

- పాఠశాలలు నిర్వహణకు 130 కోట్లు విడుదల
- వచ్చే వారంలో పాఠశాలలకు ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డు
- నెలాఖరు వరకు మండలానికి రెండు పాఠశాలల్లో మరమ్మత్తు పనులు పూర్తి చేయాలి
- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

**శామ్, డిసెంబర్08(కెరటం ప్రతినిధి)**

డిసెంబర్ నెలాఖరు వరకు మండలానికి రెండు పాఠశాలల్లో మరమ్మత్తు పనులు పూర్తి చేసి ప్రారంభించడానికి సిద్ధం చేయాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్ నుండి మన ఊరు - మనబడి, తొలిమెట్టు కార్యక్రమంపై టిఎస్.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్య సంచాలకులు శ్రీదేవసేన లతో కలిసి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే వారంలో మన ఊరు మనబడి క్రింద ఎంపిక చేసిన పాఠశాలలకు ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డు పంపనున్నట్లు చెప్పారు. ఇక పై సెంట్రల్ పూలింగ్ విధానం ద్వారా నిధుల విడుదల చేయనున్నట్లు చెప్పారు. డిసెంబర్ చివరి నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయాల ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. పాఠశాలలు నిర్వహణకు 130 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, కార్పొరేట్ విద్యను అందించేందుకు సీఎం కేసీఆర్ మన ఊరు మన బడి కార్యక్రమానికి రూపకల్పన చేశారని చెప్పారు. ఈ పథకంలో మొదటి దశలో ఎంపిక చేసిన 9123 పాఠశాలల్లో 30 లక్షల కంటే అధిక వ్యయం అవుతున్న పాఠశాలల్లో కొన్ని మాత్రమే గ్రౌండ్ అయ్యాయని మిగిలిన పాఠశాలల్లో పనులు ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ నామినేషన్ పద్ధతిలో పనులు చేపట్టాలని మంత్రి సూచించారు.

ప్రతి మండలంలో రెండు మోడల్ పాఠశాలలను ఎంపిక చేసి, ఈ నెలాఖరు వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1200 పాఠశాలలను ప్రారంభించేందుకు సన్నద్ధం చేయాలని కలెక్టర్లకు మంత్రి సూచించారు. మోడల్ పాఠశాలలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని చెప్పారు.



10% గ్రీన్ బడ్జెట్ వినియోగిస్తూ పాఠశాలల్లో పచ్చదనం పెంపొందెలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 1200 మోడల్ పాఠశాలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, క్షేత్రస్థాయిలో రెడ్కో అధికారులతో పూర్తి చేపించుటకు చర్యలు తీకుంటున్నట్లు చెప్పారు. మన ఊరు మనబడికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు వెంటనే నిధులు విడుదల చేస్తామని మంత్రి తెలిపారు.

మన ఊరు మన బడి కార్యక్రమానికి నిధులకు ఎలాంటి కొరత లేదని, పనులకు ఎఫ్టి.ఓ లు జనరేట్ చేసిన వెంటనే విడుదల జరుగుతుందని అన్నారు. గడిచిన వారం రోజుల్లో 100 కోట్ల నిధులు మన ఊరు మనబడి కింద విడుదల చేసామని తెలిపారు. సెంట్రల్ పూలింగ్ విధానం ద్వారా చెల్లింపులు జరుగుతాయని చెప్పారు. పూర్తి చేసిన పనులకు జాప్యం చేయక ఎఫ్.టి.ఓ లు జనరేట్ చేయాలని తదుపరి నిధులు విడుదలవుతాయని మంత్రి పేర్కొన్నారు. పాఠశాలలకు అవసరమైన ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డు వచ్చే వారం జిల్లాలకు వస్తాయని, వాటిని మోడల్ పాఠశాలలకు పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు. మోడల్ పాఠశాలలో ఉన్న పాత ఫర్నిచర్ ను తొలగించాలని, బీరువాలకు రంగులు వేయాలని, పాడయిపోయిన ఫర్నీచర్‌ను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తొలగించాలని అన్నారు.

పాఠశాలల నిర్వహణ కోసం ప్రభుత్వం 130 కోట్లు విడుదల చేసిందని, వాటిని సమర్థవంతంగా వినియోగిస్తూ పారిశుధ్యం, మారుగుదొడ్లు నిర్వహణ లో ఇబ్బందులు రాకుండా కలెక్టర్ లు పర్యవేక్షించాలని మంత్రి కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల ప్రాథమిక పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు అవసరమైన పుస్తకాలు కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తున్నామని, జిల్లాల్లో గ్రంథాలయ ఏర్పాటుకు ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేయాలని మంత్రి సూచించారు. మన ఊరు మన బడికి సంబంధించి మోడల్ పాఠశాలలతో పాటు మిగిలిన పాఠశాలల పనులు వేగవంతం చేయాలని, మార్చి చివరి నాటికి మొదటి దశలో ఎంపిక చేసిన పాటశాలల్లో నూరు శాతం పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఇంజనీరింగ్ అధికారులు నాణ్యతల తనిఖీలు చేయాలని తెలిపారు. టి.ఎస్.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో పెయింటింగ్ అంశంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిబంధనలు ప్రకారం రంగులు వేయాలని క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండాలని, కలెక్టర్ లు ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరారు. 30 లక్షల రూపాయల కంటే అధికంగా ఖర్చు జరిగే పాఠశాలలకు టెండర్లు రాని పక్షంలో స్థానిక ఎమ్మెల్యే సహకారంతో నామినేషన్ ద్వారా పనులు ప్రారంభించాలని కోరారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ జిల్లాలో 61 మోడల్ పాఠశాలల డిసెంబర్ చివరి నాటికి ఎన్.ఆర్. ఈ.జి.ఎస్. పనులు పూర్తి చేసి ప్రారంభానికి సన్నద్ధం చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 6 పాఠశాలలో టెండర్ ప్రక్రియ పూర్తి కాగా పనులు ప్రారంభించాల్సి ఉన్నదని సోమవారం వరకు పనులు ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లాలో మన ఊరు మనబడి కింద పూర్తి చేసిన పనులకు ఎఫ్.టి.ఒలు జనరేట్ చేయాలని, ప్రభుత్వం నిధులు విడుదల సెంట్రల్ పూలింగ్ విధానం ద్వారా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విధులకు ఎలాంటి కొరత లేనందున క్షేత్రస్థాయిలో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, పంచాయతీ రాజ్ ఈఈ సుధాకర్, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీవోలకు కారు

# అలవెన్సు మంజూరు చేయాలి

- వివిధ గ్రామ పంచాయతీలను ద్విచక్ర వాహనాలపై సందర్శన
- అనారోగ్య సమస్యలతో పాటు తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో ప్రధాన భూమిక ఎంపీవోలదే
- ఎంపీవో సంఘం జిల్లా అధ్యక్షులు బత్తిన శ్రీనివాసరావు
- ప్రభుత్వ విప్ రేగా కాంతారావుకు వినతి పత్రం అందజేత

**శామ్, డిసెంబర్08(కెరటం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ మండలాల్లో మండల పంచాయతీ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న మండల పంచాయతీ అధికారులకు కారు అలవెన్సు మంజూరు చేయాలని, వివిధ గ్రామ పంచాయతీలను ద్విచక్ర వాహనాలపై సందర్శన చేయాల్సి వస్తోందని, అనారోగ్య సమస్యలతో పాటు తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో ప్రధాన భూమిక ఎంపీవోలదేనని మండల పంచాయతీ అధికారుల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు, పినపాక ఎంపీవో బత్తిన శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మండలాలలో మండల పంచాయతి అధికారులుగా విధులు నిర్వహిస్తున్న మండల పంచాయతీ అధికారులకు ప్రతి మండలంలో పది నుండి సుమారు 40 వరకు గ్రామపంచాయతీలు కలిగినటువంటి మండలాలలో మండల మండల పంచాయతీ అధికారిగా ప్రతి వారం నాలుగు రోజులు యాప్ ఇన్స్పెక్షన్‌లో భాగంగా ప్రతిరోజు ఒక గ్రామపంచాయతీ యాప్ ఇన్స్పెక్షన్, వివిధ గ్రామ



పంచాయతీలలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించాల్సి ఉంటుందని తెలిపారు. గ్రామపంచాయతీ ద్వారా చేపడుతున్న వివిధ పనులు పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ, డంపింగ్ యార్డ్, స్మశాన వాటికలు నిర్వహణ, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, అవెన్యూ ప్లాంటేషన్, తెలంగాణ గ్రామీణ క్రీడ మైదానాలు ఏర్పాటు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు పర్యవేక్షించుటకు ప్రతిరోజు నాలుగు గ్రామపంచాయతీలు సందర్శించడం జరుగుతున్నదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో ప్రజలకు చేరవేయడంలో ప్రధాన భూమిక పోషిస్తున్న మండల పంచాయతీ అధికారులకు ప్రతినిత్యం గ్రామాలలో సందర్శించడం వలన మండల పంచాయతీ అధికారులపై తీవ్ర ఆర్థిక భారం పడుతున్నదని తెలిపారు. ఎక్కువ అధికారులు 45 సంవత్సరముల పైబడి ఉన్నవారికి ప్రతిరోజు వివిధ గ్రామ పంచాయతీలు ద్విచక్ర వాహనాలపై సందర్శించడం వలన అనారోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బంది తీవ్రంగా పడుతున్నందున ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో ప్రధాన భూమిక పోషిస్తున్న మండల పంచాయతీ అధికారులకు ప్రతినెల 30 వేల రూపాయల చొప్పున కార్ అలవెన్స్ ప్రభుత్వం ద్వారా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.